

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

చిత్తూరు తిరుపతి

ఆదివారం 25 మే 2025

పేజీలు 9


# అవినీతి, అక్రమార్కులకే ఉపాధి

**మస్టర్లలో మాయాజాలం...**
**కంపెనీల కార్మికులకూ జాబ్ కార్డులు**

**పనికన్నా అదనంగా నమోదు...**
**ప్రతిఫలంగా వసూళ్లు**

**అయినవారికి ఆకుల్లో కానివారికి కంచాల్లో**
**చందాగా పనుల కల్పనలో పక్షపాతం**

**క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు కుమ్మక్కు**
**వాటాలు..?**



**చిట్టమూరు, మేజర్‌న్యూస్:**

చిట్టమూరు మండలంలో ఉపాధి హామీ పథకం అవినీతి మయమైంది. క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు కొందరు కుమక్కై అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినవారికి ఆకుల్లో కాని వారికి కంచాల్లో చెందగా పనుల కల్పనలో క్షేత్రస్థాయి సిబ్బంది మస్టర్లలో మాయాజాలం ప్రదర్శిస్తూ జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలూ ఉన్నాయి. ప్రైవేటు ఉద్యోగులు, కంపెనీ కార్మికుల పేరుతో జాబ్‌కార్డులు జారీ చేసి వారు పనులకు హాజరువుతున్నట్లు చూపి జేబులు నింపుకుంటున్నారని ఆరోపణలున్నాయి. కూలీలు చేసిన పనికన్నా ఎక్కువ చూపి వారికి అదనంగా లబ్ధిచేకూరుస్తూ అందులో కొంత మొత్తం మింగేస్తూ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ పర్యవేక్షించే అధికారులకూ వాటాలు ఇస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి. సామాజిక తనిఖీలు చేసే అధికారులు కూడా మామూళ్లు పుచ్చుకొని మమ అనిపిస్తుండటంతో సిబ్బంది వసూళ్ల పర్వానికి అడ్డూ అదుపూ లేకుండా పోయిందని ఉపాధి శ్రామికులు కొందరు ఆరోపిస్తున్నారు. పేద కుటుంబాలకు భరోసా ఇస్తూ, వలసల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకం అవినీతి పరులకు ఉపాధిగా మారింది. కొందరు ద్వితీయ స్థాయి నేతల ధన దాహం, క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటంతో పథకం

మిగతా 8లో



## భక్తాగ్రేశ్వరుడిపై వేణుగోపాలుడి విహారం

**రాత్రి గజవాహనంపై ఊరేగిన ముద్దుగోపాలుడు**

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:**

భక్తాగ్రేశ్వరుడుపై హనుమంతుడు లోకరక్షకుడైన వేణుగోపాల స్వామి కొలువుతిరి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్వేటినగరంలో వెలసిన రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల భాగంగా శనివారం ఉదయం హనుమంత వాహనపై ఊరేగుతూ భక్తులకు దర్శన్ భాగం కల్పించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతతో మేలుకొలుపు శుద్ధి తోమాల కొలువు పంచాంగ శ్రవణం అర్చన మొదటి గంట సర్వదర్శనం, ఊరేగింపు అనంతరం స్వామివారికి పాలు పెరుగు తేనెహరిద్రవం నారికేల జల సుగంధర్ ద్రవ్యాలతో స్థాపన తిరుమంజనం నిర్వహించారు. ఆలయంలో వసంతోత్సవం స్వామి వారికి ఆస్థానం మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఉభయ నాంచార్ల

మిగతా 8లో

## సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు

**ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు జిల్లాలో 13సెంటర్లు ఏర్పాటు చేశామని 12 ప్రభుత్వ కళాశాలలు, ఒక ప్రైవేటు కళాశాలను సెంటర్లో పరిక్ష జరగనున్నాయని 5261 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. యూపీఎస్సీ ఎగ్జామినేషన్‌ను ఉదయం 9.30గంటల నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లుగా పరీక్ష జరగనుంది.ఎగ్జామ్ సెంటర్ల కు సమీపంలో ఉన్నా ఇంటర్నెట్, జిరాక్స్ షాపులను మూసివేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వాచ్లు, అనుమతించబడదని ఒక్కొక్క పరీక్ష కేంద్రం వద్ద సీఐ అధికారి, ఏఎస్ఐ/హెడ్‌కానిస్టేబుల్స్‌తో పాటు ముగ్గురు కానిస్టేబుల్స్‌ను మొత్తం ఐదుగురుని భద్రతా పరంగా

మిగతా 2లో



## అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా...
# ఏఎంసీ మార్కెట్..!

**కనీస వసతులు లేక అల్లాడుతున్న రైతులు**

**పుంగనూరు, మేజర్‌న్యూస్:**

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ 16 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది 72 మండీలు ఉన్నాయి ప్రతినిత్యం వందల టన్నుల టమాటా రైతులు మండీలకు తీసుకువస్తున్నారు వందల లారీలు ఇక్కడి నుండి టమోటాను ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నారు. అలాంటి మార్కెట్లోలో పగలు రేయి తేడా లేకుండా మందుబాబులు మార్కెట్ పరిసర ప్రాంతాలలో కూర్చుని మద్యం సేవిస్తున్నట్లు రైతులు మండి వ్యాపారస్తులు వాపోతున్నారు. ఈ మార్కెట్ ఆవరణంలో కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. మరుగుదొడ్లు ఉన్న గేట్లకు తాళాలు వేసి ఉన్నాయి అని కొంతకాలంగా మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండటం వల్ల గేట్లకు పిచ్చి మొక్కలు అల్లుకున్నాయని

మిగతా 2లో



## సీఎం పర్యటనకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు

**చిత్తూరు జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు**
**ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్ల పరిశీలన**



**శాంతిపురం, మేజర్‌న్యూస్:** శనివారం నుండి 26వ తేదీ వరకు ముఖ్యమంత్రి కుప్పం పర్యటన సందర్భంగా బందోబస్తు విధులలో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం. ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా కొన్ని ప్రాంతాలలో ట్రాఫిక్ మళ్ళింపు ఉంటాయి. బందోబస్తులో సుమారు 600మంది పోలీసు సిబ్బంది పాల్గొంటారు. ప్రతి ఒక్కరు వారికి కేటాయించిన విధులలో ఎటువంటి అలసత్వం వహించకుండా ఉద్యోగాన్ని నిర్వర్తించాలి. భద్రతా ఏర్పాట్లలో భాగంగా ద్రావిడ్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. నూతనంగా నిర్మించి సీఎం గృహప్రవేశం చేయనున్న ఇంటిని, పరిసరాలను డైరెక్టర్ నాచ్‌కేత్ విశ్వనాథ్‌తో కలిసి క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ శాంతిపురం మండలంలో నూతనంగా నిర్మించిన తన సొంతింటి గృహ

మిగతా 8లో

## సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలకు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

నియమించడం జరిగినది. డిఎఫ్ ఎమ్ డి హెచ్ హెచ్ ఎమ్ డితో పాటు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయడం జరుగుతుందని యూపిఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష జరుగుతున్న సమయంలో నిరంతరం డిఎస్పి స్థాయి అధికారి పర్యవేక్షణ చేశారు.పరీక్ష కేంద్రల వద్ద ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ట్రాఫిక్ డిఎస్పి స్థాయి అధికారితో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని పరీక్ష కేంద్రాలు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగినదని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అన్నారు.

## ఈ నెల 26, 27న ఎస్టీల ప్రత్యేక ఆధార్ క్యాంపు

**కోట, మేజర్‌న్యూస్:** కోట మండలం కొత్తపట్నం సచివాలయం నందు ఈనెల 26 27 తేదీలలో ఎస్టి స్పెషల్ ఆధార్ క్యాంపు నిర్వహించబడుతుందని కోట ఎంపీడీఓ దిలీప్ కుమార్ తెలిపారు. అదేవిధంగా సిద్దవరం సచివాలయంలో 28, 29 తేదీలలో ఎస్టి స్పెషల్ ఆధార్ క్యాంప్ నిర్వహించబడుతుందన్నారు. కావున కొత్తపట్నం నందు గుర్తించబడిన151 మంది, సిద్దవరం నందు గుర్తించబడిన 88 మంది సదరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సింది గా ఎంపీడీఓ కోరారు. తదుపరి పై రెండు కేంద్రాలలో క్యాంపు పూర్తయిన పిదప మరల అన్ని సచివాలయాల్లో కూడా క్యాంపు నిర్వహించబడుతుందన్నారు.

## మహానాడును విజయవంతం చేయండి

**పలమనేరు, మేజర్‌న్యూస్:** ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ నియోజకవర్గ అబ్జర్వర్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు.



వైకాపా ప్రభుత్వ అరాచకాలు, తెలుగుదేశం పార్టీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించ డమే గాక రెండు ప్రభుత్వాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తెలియజేశారు. పేదల కడుపు నింపే పార్టీ తెలుగుదేశం అయితే పేదల కడుపు కొట్టే పార్టీ వైకాపా అని విమర్శలు గుప్పించారు. కడపలో జరగనున్న మహానాడు పండుగకు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కేడర్‌కు ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వి.కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు టౌన్, రూరల్, పెద్దపంజాణి, గంగవరం మండలాల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, కిషోర్ గౌడ్, ఆర్బీసీ కుట్టి, నాగరాజు రెడ్డి, ఆనంద్, సోమశేఖర్ గౌడ్ సీనియర్ నాయకులు ఆర్వీ బాలాజీ, రామచంద్ర నాయుడు, ఖాజా పీర్,నాగరాజు, గిరిబాబు, దీపికా కృష్ణమూర్తి, చాన్ బాషా, బిఆర్‌సికుమార్, మదన్,శ్రీధర్,కోటి, భాస్కర్‌యాదవ్, నదీమ్, రిటైర్డ్ టీచర్ పాండురంగయ్య, పార్టీ ప్రధాన కార్యదర్సులు, క్లస్టర్ ఇంచార్జులు, యూనిట్ ఇంచార్జులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన వెదురుకుప్పంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి తాగునీటి సమస్యకు గంగాధర నెల్లూరు నియోజకవర్గ శాసనసభ్యులు



డాక్టర్ వి.ఎం.థామస్ చొరవతో పరిష్కారం లభించింది. వెదురుకుప్పం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి 18సంవత్సరాల నుండి తాగు నీటి వసతి లేకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతుండేవారు. నీటి సమస్యను గుర్తించిన స్థానిక శాసనసభ్యులు డాక్టర్ వి.ఎం థామస్ శనివారం తాగునీటి బోరును డ్రిల్లింగ్ చేపించడానికి ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తాగునీటి బోరును డ్రిల్లింగ్ చేయగా నీరు సమృద్ధిగా పడడంతో స్థానికులు, ప్రజలు, విద్యార్థులు ఎమ్మెల్యేను అభినందించారు.

## మహిళ మెడలో చైన్ చోరీ

**పుత్తూరు, మేజర్‌న్యూస్:** మహిళ మెడలో చైన్ చోరీ జరిగిన సంఘటన పుత్తూరు పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. ద్విచక్ర వాహనంలో తన కుమారునితో ఓ మహిళ వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు మరో ద్విచక్ర వాహన అతివేగంగా వచ్చి వాహనాన్ని ఢీకొని అదుపు తప్పి కుమారుడు మహిళ పడిపోవడంతో చైన్ లాక్కొని వెళ్లారు. మహిళ మెడ తీవ్ర గాయాలతో పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీస్ సిఐ సురేంద్రనాయుడు కథనం మేరకు ఇలా



పుత్తూరు ఆర్టీసీ కాంప్లెక్స్ నందు సుగుణ మోటార్స్, పైపులు దుకాణం నిర్వహిస్తున్న ఆర్. కళ్యాణి ప్రతిరోజు తిరుపతి నుండి వచ్చి పుత్తూరులో దుకాణం నిర్వహిస్తోంది. యధావిధిగా శనివారం రాత్రి 7.30 గంటలకు దుకాణాన్ని మూసివేసి సాయంత్రం తన కుమారునితో ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయలుదేరగా యం. యన్.యం పెట్రోల్ బంకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద వెళుతుండగా అదే అదునుగా ద్విచక్ర వాహనంపై వెంబడిస్తూ వచ్చి, కళ్యాణి వాహనాన్ని ఢీకొని ఆమె పడిపోవడంతో చైన్ లాక్కెళ్ళారు. ఈ పెనుగులాటలో ఆమెకు మెడ, చేతులు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స అందించారు. సిఐ సురేంద్ర నాయుడు, ఎస్సై ఓబయ్య ఆమెను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

# అసాంఘిక కార్యక్రమాలకు అడ్డా... ఏఎంసీ మార్కెట్..!

(మొదటిపేజీ తరువాయి)

మరుగుదొడ్లకు పోవాలన్న ఇబ్బందిగా మారుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారురోడ్లు గుంతల మయమై ఉండటం వల్ల లారీ డ్రైవర్లు వాహనాలు నడపడానికి ఇబ్బంది పడుతున్నామన్నారు. ఈ విషయమై వ్యవసాయమార్కెట్ కార్యదర్శిని సంప్రదించగా మరుగు దొడ్ల నిర్మాణానికి టెండర్లు పిలవడం జరిగిందన్నారు. అలాగే ఉన్న మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకొస్తామని ఇప్పటికే పలుమార్లు అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు ఫిర్యాదు చేసామని వారు కూడా గస్తీ నిర్వహిస్తున్నారని మార్కెట్లో సిబ్బంది కొరత ఉందని పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.









# తుడా చైర్మన్ దివాకర్ రెడ్డికి ఘన సత్కారం

**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి తిరుమల శ్రీవారి బోర్డు మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన దివాకర్ రెడ్డిని,చంద్రగిరిమండల పరిధిలోని తొండవాడ పంచాయతీలో ఉన్న గ్రామస్తులు, టిడిపి సీనియర్ నాయకులు, యువనాయకులు, జనసేన నాయకులు, మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వారు మాట్లాడుతూ డాలర్ దివాకర్ రెడ్డి పాలనలతో తిరుపతి డెవలప్మెంట్ అథారిటీ సంస్థ మరింత అభివృద్ధి చెందు తుందని కూటమి నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు, డాలర్ దివాకర్ రెడ్డి గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి దిశగా తుడాకు సంబంధించి ఏ ఒక్క అభివృద్ధికి సంబంధించిన పనులు అయినా ఎన్‌డిఏ కూటమి, ఎమ్మెల్యే పులవర్తి నాని, నేను అండగా ఉండి మీ గ్రామానికి నెరవేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కూటమి నాయకులు దుశ్వాలతో



సన్మానించి, పుష్పగుచం అందజేసి ఘనంగా సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పొట్టి శ్రీరాములు విగ్రహ ప్రాంగణం పునరుద్ధరణ



**నాయుడుపేట, మేజర్‌న్యూస్:**

నాయుడుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఉన్న శ్రీపొట్టి శ్రీరాములు విగ్రహ ప్రాంగణాన్ని పునరుద్ధరించారు. దీనికి సహకరించిన వారికి తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మున్సిపల్ వైసీచైర్మన్ షేక్ రఫీ సహకారంతో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా శ్రీకారం చుట్టారన్నారు. విగ్రహాన్ని పునరుద్ధరించి ప్రజలలో దేశభక్తి పెంపొందించడమే లక్ష్యమన్నారు.

# ముడియూరు విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేసి టెండర్లు పిలవండి

### విద్యుత్ శాఖ సీఎండీ సంతోషరావును కోరిన ఎమ్మెల్యే ఆదిమూలం

బుచ్చినాయుడుకండ్రిగ, మేజర్‌న్యూస్: పిచ్చాటూరు మండలంలోని ముడియూరు కు ప్రభుత్వం ప్రతిపాదించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ను మంజూరు చేసి, టెండర్లు పిలిచి త్వరగా పనులు ప్రారంభించాలని విద్యుత్ శాఖ సీఎండీ సంతోష రావు ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు.శనివారం తిరుపతి లోని ఏపీఎస్పిడీసిఎల్ సీఎండీ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకొని ఈ మేరకు సీఎండీ సంతోష రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిచ్చాటూరు మండలంలోని ముడియూరు ప్రాంత రైతులు, ప్రజల విద్యుత్ సమస్యను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా స్పందించి ఈ పంచాయితీకి 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. అయితే విద్యుత్ శాఖ ద్వారా మంజూరు, టెండర్లు ప్రక్రియ ముందుకు సాగకపోవడం, పనులు ప్రారంభంలో జాప్యం జరగడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారని ఎమ్మెల్యే, సీఎండికి వివరించారు. ఇప్పటికైనా సమస్యను గుర్తించి ప్రభుత్వం ప్రతిపాదించిన మూడియూరు విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు చేయడంతో పాటు టెండర్లు పిలిచి త్వరగా పనులు ప్రారంభించాలని సీఎండీ సంతోష రావుకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. తన విజ్ఞప్తికి సీఎండీ సంతోష రావు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు.



## నేడు బీఈడీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**కోట, మేజర్‌న్యూస్:** కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి బిఈడి కళాశాలలో 1986-87 విద్యా సంవత్సరంలో బీఈడీ శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 3 గంటల వరకు విద్యానగర్ లోని ప్రస్తుత ఎన్బికెఆర్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో అపూర్వ ఆత్మీయ సమ్మేళనం జరుపుకోనున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆనాటి గురువులను సత్కరించనున్నారు. పై కార్యక్రమానికి ఆనాటి పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని పూర్వ విద్యార్థుల కమిటీ నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వానించుచున్నారు.



## చిల్లకూరులో తెలుగుదేశంలో చేరికలు

**చిల్లకూరు, మేజర్‌న్యూస్:** తానంకి నానాజీ నివాసం నందు చిల్లకూరు గ్రామంలోని పలువురు యాదవ సోదరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం ఉదయం పిల్లెల సురేష్, కాటూరు శ్రీహరి, గొత్తల ఆకాష్, వీరి బోయిన కిషోర్, కాటూరు చంద్రశేఖర్‌లు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ కార్యదర్శి చిల్లకూరు పట్టాభిరెడ్డి, నియోజకవర్గ రైతు ప్రధాన కార్యదర్శి కొండా రామచంద్రరెడ్డి, సీనియర్ నాయకులు దాసరి రాంప్రసాద్ సమక్షంలో పార్టీలో చేరారు.



## సమాజ అవసరాన్ని తీర్చేదే సాహిత్యం

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** కాలానుగుణంగా సమాజానికి ఏమీ అవసరమో దాన్ని సాహిత్యం తీర్చుతుందని కథ, నవల, నాటక రచయిత డాక్టర్ విఆర్ రాసాని అన్నారు. శనివారం తిరుపతిలోని స్థానిక యూత్ హాస్టల్లో అనంతపురం జిల్లా వాసి డాక్టర్ బి నాగ శేషు రచించిన ఏకుదారం పుస్తకా విష్కరణ జరిగింది. పుస్తకాన్ని ప్రాచ్య పరిశోధన సంస్థ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు పుస్తకావిష్కరణ చేశారు. తొలి ప్రతిని రచయిత ఆర్‌సి.కృష్ణస్వామి రాజు అందుకున్నారు.సభకు ఈ తరం కవిత వేదిక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాసాని మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో బీరప్ప గురించి ఎవరికి తెలియదని చెప్పారు. పుస్తక ఆవిష్కరణ కర్త ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నవలలో రచయిత నాడి స్పందన ఆద్యంతం కనిపిస్తోందని తెలిపారు.ఆత్మీయ అతిథి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వై.సుభాషిని మాట్లాడుతూ కులవృత్తిదారులు ప్రపంచీకరణలో కొట్టుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఆత్మీయ అతిథి బొమ్మిశెట్టి రమేష్ మాట్లాడుతూ జీవితంలో కష్టాలు ఎదురైనప్పుడు ఆత్మ పరివర్తన, ఆత్మహత్య అను రెండు మార్గాలు ఉంటాయని వాటిలో రచయిత ఆత్మ పరివర్తన దిశగా వెళ్లి అత్యద్భుతంగా అభివృద్ధి చెందారని వివరించారు. పీలేరు డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ కే.శ్రీనివాసులు రెడ్డి పుస్తక సమీక్ష చేస్తూ స్థలం, కాలం, చలనం గురించి ఈ నవలలో స్పష్టంగా ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రచయితలు ఆకుల మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రమణ్యం, మారిశెట్టి గోవిందు, డాక్టర్ యువశ్రీ, కొత్వాలు అమరేంద్ర, నాగార్జున శర్మ, పులివెందుల కొండారెడ్డి, పుస్తకం ముద్రణ కర్త మంజునాథ, సాహితీ మిత్రులు, తెలుగు భాష అభిమానులు, కవులు తదితరులు పాల్గొన్నారు.



## తమ్మినపట్నంలో ఆంజనేయ స్వామి పూజ

**గూడూరు, మేజర్‌న్యూస్:** తమ్మిన పట్నం గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. మూడవ రోజు శనివారం విశ్వక్సేన పూజ మరియు స్వామివారికి చందన అలంకరణము చేశారు. అదే విధంగా 1008 తమలపాకులతో ఆకు పూజ 1008 అరటిపళ్ళతో అలంకరణ, పూర్ణాహుతి అంగరంగ వైభవంగా నిర్వహించారు. 2000 మందికి గ్రామస్తులచే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.గిరి కృష్ణ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సతీష్ యాదవ్ భక్తాన్ని రామయ్య రామాలయం ధర్మకర్త, తిరుపతి పార్లమెంట్ మత్స్య సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకల వెంకయ్య బీసీ సెల్ నాగూర్, గ్రామ పెద్దలు కోట రమణయ్య కొప్పాల సుబ్బయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



# బడుగు బలహీనవర్గాల సంక్షేమే టీడీపీ లక్ష్యం

### సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు సుళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా నాయుడుపేట పట్టణంలోని వెలుగు కార్యాలయంలో శనివారం బాలజ్యోతి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజనుల సంక్షేమం పై ప్రత్యేక సమావేశంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే విజయ్‌శ్రీ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గంలోని గిరిజనుల నివాసాలు ఉంటున్న కాలనీలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. కొత్తగా మళ్లీ ఆరు మండలాలు 18 కోట్లతో కొత్తగా ప్రతిపాదనలు తయారుచేసి అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించేందుకు జరిగిందన్నారు. ఇందులో ముఖ్యంగా గిరిజనుల కోసం రోడ్లు తాగునీటి వసతి తదితర సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. గిరిజనుల కూడా విద్యావంతులు కావాలన్నా ప్రధాన లక్ష్యంతో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అదేవిధంగా గిరిజనలు వారి అవసరమైన ప్రతి ఒక్కరు సులూరుపేట నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్‌లో అర్జీలు అందజేస్తే వాటిని అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సురేష్‌బాబు, స్పెషల్ ఆఫీసర్ గోవర్ధన్, ఎంఈఓ మునిరత్నం, సీడీపీఓ ఉమామహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.



## జనసేన సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5లక్షల బీమా

**సత్యవేడు, మేజర్‌న్యూస్:** వరదయ్యపాలెం మండలంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి తడ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం. వరదయ్యపాలెం మండలంలో శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సత్యవే నియోజవర్గం లో సభ్యత్వ నమోదు చేపట్టి నట్లు తెలి పారు జనసేన పార్టీ మరింత బలోపేతం అయ్యేందుకు మరియు పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు వాళ్ళ కుటుంబ సభ్యులకు భరోసా ఇస్తుంది క్రియా శీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఈ అవకాశాన్ని జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు,వీర మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీ సభ్యత్వం తీసుకుంటే సభ్యులకు మేలు జరుగుతుందన్నారు. ఏపార్టీలో లేని విధంగా రూ.5లక్షల బీమా, 50వేల మెడికల్ ఇన్సూరెన్స్ పార్టీ అధిష్టానం అందిస్తుందన్నారు. కావున జనసేన కార్యకర్తలు సభ్యత్వ చేసుకుంటూ అందరి దగ్గర చేపిస్తూ పార్టీని బలోపేతం చేసేదిగా అందరూ కలిసి ముందుకు అడుగులు వేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి విజయ్ కుమార్ వెల్లూరు చిరంజీవి, శ్రీధర్,రెడ్డి శేఖర్, దొడ్డి శేఖర్, శిరీష, జనార్ధన్, లోహిత్, శ్రీను, దమ్ము, సాయి, హరి, హేమభూషణ్ పాల్గొన్నారు.





## నేడు ముత్యాలమ్మ పుష్పపల్లకి ఊరేగింపు

**రొంపిచెర్ల, మేజర్‌న్యూస్:** ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం రొంపిచెర్ల పురవీధులలో ముత్యాలమ్మ అమ్మవారి పుష్పపల్లకి బ్యాండు మేళాలతో ఊరేగింపు జరగనుంది. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి 101 బిందెల పసుపు నీళ్లతో జలాభిషేకం చేయనున్నారు. అలాగే పంచామృతాలతో మహాభిషేకం వివిధ రకాల పుష్పాలతో మాలలతో ప్రత్యేక అలంకరణ చేసి మంగళ హారతిని ఇస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి కేరళ డ్రమ్స్, వాయిద్యాలతో రొంపిచెర్ల పురవీధులలో పుష్ప పల్లకిలో ముత్యాలమ్మ అమ్మవారిని ఊరేగించనున్నారు. ఈ కార్యక్రమాలను ప్రజలు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు గుణశేఖర్ కోరారు. జాతర అనంతరం అమ్మవారి చీరలు, రవికలు వేలం వేస్తామని తెలిపారు. కావాల్సిన భక్తులు వేలంపాటలో పాల్గొని పొందాలని సూచించారు.

# బాలిరెడ్డిపాలెం సచివాలయం తనిఖీ చేసిన ఎంపీడీఓ

**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలంలోని బాలిరెడ్డిపాలెం గ్రామ సచివాలయాన్ని శనివారం ఎంపీడీవో శ్రీనివాసులు తనిఖీ చేయడం జరిగింది. మండలంలోప్రస్తుతం జరుగుతున్న యోగాంధ్ర సర్వే, ఈకేవైసీలలో వెనుకబడి ఉన్నందువల్ల వాటిని వెంటనే సకాలంలో పూర్తి చేయవలసిందిగా సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో ఆదేశించారు. విధుల పట్ల ఎటువంటి అలసత్వం లేకుండా ప్రజలతో సత్సంబాంధాలు కలిగి వారి పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా ఉండాలని సిబ్బందికి తెలియజేయడం జరిగింది. సచివాలయంలో ఉన్న పలు రిజిస్టర్లను తనిఖీ చేశారు., సచివాలయ సిబ్బంది ఏమైనా అత్యవసర పని నిమిత్తం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత పంచాయతీ కార్యదర్శికి వివరణ ఇచ్చి వెళ్లాల్సిందిగా సచివాలయ సిబ్బందికి సూచించడం జరిగగింది. కార్యాల యంలో పరిశుభ్రత పాటించాల్సిందిగా వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాల్సిందిగా ఎంపీడీఓ వారు సిబ్బందికి తెలియచేయడం జరిగింది. ప్రభుత్వం చేపడుతున్నటు వంటి సర్వేలలో ఎటువంటి అవకతవకలు జరక్కుండా సకాలంలో పూర్తిచేసి మండలాన్ని ముందంజలో ఉంచవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శిల్ప, డిజిటల్ అసిస్టెంట్ విశ్వవీణ, అగ్రికల్చర్ అసిస్టెంట్ హర్ష పాల్గొన్నారు.



# శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసేందుకు కార్యాచరణ

## - టిటిడి ఈఓ శ్యామల రావు

**తిరుమల, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడిలో శ్రీవారి సేవను విశ్వవ్యాప్తం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను టిటిడి ఈవో శ్యామల రావు ఆదేశించారు. టిటిడి పరిపాలనా భవనంలోని ఈవో ఛాంబర్‌లో శనివారం 14 దేశాలకు చెందిన వివిధ రంగాల ఎన్.ఆర్.ఐ నిపులతో వర్చువల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి భక్తులకు స్వచ్ఛందంగా కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పలు రాష్ట్రాలనుంచి శ్రీవారి సేవకులు తిరుమలకు వచ్చి చక్కటి సేవలు అందిస్తున్నారని, త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాలలో నిపుణులైన ఎన్.ఆర్.ఐలు స్వచ్ఛందంగా సేవలు అందించేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు .టిటిడిలోని వివిధ విభాగాలలో దేశవ్యాప్తంగా శ్రీవారి సేవకులు అందిస్తున్నారని, వారి సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అమెరికా తదితర దేశాలలో శ్రీనివాస కల్యాణాలు విరివిగా నిర్వహించేందుకు వారు



సహకరిస్తున్నారని ,తాజాగా శ్రీవారి సేవలో తీసుకువస్తున్న సంస్కరణల మూలంగా వైద్యం, ఐటీ, ఇంజనీరింగ్, ప్లానింగ్, వాటర్ మేనేజ్మెంట్ , ఫుడ్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, టౌన్ ప్లానింగ్ తదితర విభాగాలలో సేవలు అందించేందుకు ఎన్.ఆర్.ఐలు ముందుకు వస్తున్నారన్నారు. ఎన్.ఆర్.ఐల నైపుణ్యం ఆధారంగా వారి సేవలను టిటిడిలో అమలు చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు .వైద్య రంగానికి చెందిన వివిధ విభాగాల వైద్యులతో పాటు వివిధ రంగాల నిపుణులు సేవలు అందించేందుకు ముందుకు వచ్చారని ఈవో తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎన్‌ఆర్‌ఐలు టిటిడి శ్రీవారి సేవకుల సేవలను విశ్వవ్యాప్తం చేసేందుకు ముందుకు రావడంపై ఈ అవకాశం తమకు స్వామి. వారు కల్పించిన మహద్భాగ్యం అని హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్చువల్ సమావేశంలో జర్మనీ - సూర్యప్రకాశ్, డా. శివశంకర్, ఐర్లాండ్ - సంతోష్ పల్లె, రమేశ్ గుమ్మడవల్లి, యూకె - లోకనాథం, విజయ్ కుమార్, అరుణ్ ముమ్మలనేని, శివరామ్ రెడ్డి, విజయ్ కుమార్, డా. అనిల్ కుమార్, డా. అనిల్ కుమార్, రీతు, నెదర్లాండ్ - శివరామ్, ఫ్రాన్స్ - కన్నెవిరనె, పోలెండ్ ఐర్లాండ్ నుండి సంతోష్ - చంద్ర అక్కల, స్వీడన్ - రమణకుమార్ రంగా, స్విట్జర్లాండ్ - అమర్ కవి, అమెరికా - రఘువీర్ బండార్, హర్షిత, అమరనాథ్, డెన్మార్క్ ,- రామ్ దాస్, మారిషష్ , శ్రీలంక - నుండి విక్కీ తురాయ్జ్ , దుబాయ్ నుండి - విక్రమ్ నుండి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. టిటిడి నుండి అడిషనల్ ఈఓ వెంకయ్య చౌదరి, సీఈ టివి సత్యనారాయణ, ఎఫ్.ఎ అండ్ సీఏవో ఓ. బాలాజీ, శేషా రెడ్డి, ట్రాన్స్ పోర్ట్ జీఎం, సీఎంవో నర్మద తదితరలు పాల్గొన్నారు.



# తుడా అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేద్దాం

## - ఛైర్మన్ సి.దివాకర్

**తిరుపతిబ్యూరో, మేజర్‌న్యూస్ :** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పనిచేద్దామని తుడా ఛైర్మన్ సి.దివాకర్ అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించారు. తుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆయా విభాగాల అధికారుల విధులు తదితరాలను ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య వివరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని అభివృద్ధికి సహకరించాలన్నారు. తుడా పరిధిలో జరిగే అన్ని అభివృద్ధి పనులు, లే అవుట్ల ఏర్పాటు పారదర్శకంగా జరిగేలా అధికారులు జాగ్రత్తగా పనిచేయాలని అన్నారు. తుడా నిధులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. తుడా లో జరుగుతున్న అభివృద్ధి ఇతర సంస్థలకు ఆదర్శంగా ఉండేలా అందరూ పనిచేయాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న లే అవుట్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బందికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని అందరూ నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో సెక్రటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, ఉద్యానవన శాఖాధికారి మాలతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పనకు కృషి చేస్తున్నాం : ఎమ్మెల్యే గాలి భాను

**నగరి, మేజర్‌న్యూస్:** యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి వారికి అండగా నిలవడం కోసం కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ తీవ్రంగా కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. నగరిలో (ఏంఆర్ ఆఎఫ్) నిర్వహించిన జాబ్ మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. సెలెక్ట్ అయిన యువతకు నియామక పత్రాలు అందించారు. నగరి నియోజకవర్గంలో యువతకు ఉద్యోగాలు కల్పించడానికి పరిశ్రమల స్థాపనకు కోసలనగరం ఇండస్ట్రీయల్ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు.






# యోగాతో ఆరోగ్య సమస్యలు అధిగమించవచ్చు

## - చిత్తూరు ఆర్ డి ఓ శ్రీనివాసులు

**చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్:** యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడులు, ఆరోగ్య సమస్యలను అధిగమించ వచ్చునని చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం చిత్తూరు పట్టణం నందు గల గాంధీ సర్కిల్ వద్ద యోగాంధ్ర మే 21 నుండి జూన్ 21 వరకు మాసోత్సవాలకు సంబంధించి యోగా కార్యక్రమంను చిత్తూరు ఆర్ డి ఓ, చిత్తూరు డిఎస్పి సాయినాథ్, పర్యాటక శాఖ అధికారి గౌరీ,డి ఎస్ డి ఓ బాలాజీ,చిత్తూరు టౌన్ సిఐ మహేశ్వర లతో కలసి యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జూన్ 21 తారీకున అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మే 21 నుండి జూన్ 21 వరకు యోగ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా చిత్తూరు పట్టణ కేంద్రంలోని గాంధీ సర్కిల్ వద్ద యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామనన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం దేశంలోని ప్రతి ఒక్కరూ యోగా ద్వారా రోజు వారీ ఎదుర్కొనే మానసిక ఒత్తిడులు, ఆరోగ్య సమస్యలను అధిగమించ వచ్చునన్నారు. మానసిక ఆరోగ్యం పరిరక్షణకు యోగ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ మంచి సదుద్దేశంతో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారి ప్రణాళికలో యోగాకు సమయం కేటాయించి ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జూన్ 21న పురస్కరించుకునే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మే 21 నుండి జూన్ 21 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పెద్ద ఎత్తున ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి యొక్క అనారోగ్య సమస్యలు, మానసిక ఒత్తిడిలను తగ్గించుకుని పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డా.లోకేష్,యోగా గురువులు బాబు,రాజేంద్ర, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పురవీధుల్లో ఊరేగిన శివపార్వతులు

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీ నగరం చెరువు వద్ద వెలిసిన శిష్టా సౌందర్యవల్లి సమేత స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, రాత్రి నూతనంగా తయారుచేసిన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం విగ్రహాల దాత పాలపురెడ్డి ప్రసాద్ రెడ్డి శ్రీదేవి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కోదండపాణి మొదలియార్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, ముఖ్య కార్య కార్య నిర్వహణ అధికారి బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు ప్రసాద్ రాజు ప్రసాద్, ప్రసాద్ రెడ్డి, సహాయ కార్యదర్శి సుబ్బరాయుడు యాదవ్, కృష్ణ స్వామి రాజు, సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# దేశం కోసం పెళ్లిని వాయిదా వేసుకున్న జవాన్

### - సెలవు రద్దు చేసుకొని యుద్ధానికి...

## పాకిస్తాన్ సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న ఆంజనేయులు

**రొంపిచెర్ల, మేజర్‌న్యూస్:** దేశం కోసం పెళ్లిని వాయిదా చేసుకొని యుద్ధానికి జవాన్ వెళ్లిన సంఘటన అన్నమయ్య జిల్లాలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి మండలం, రామాపురం గ్రామపంచాయతీ, కొత్తపల్లె గ్రామానికి చెందిన లేట్ పొలిశెట్టి ఓబులేష్, పద్మావతమ్మల కుమారుడు పి.ఆంజనేయులు జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నాడు. రొంపిచెర్ల మండలం, చెంచమరెడ్డిగారి పల్లె గ్రామపంచాయతీ, బుసిరెడ్డిగారి పల్లెకు చెందిన మాజీ సర్పంచ్ సిబ్బాల రవీంద్ర, రాధ దంపతుల కుమార్తె రెడ్డి ఉషశ్రీకు ఇచ్చి వివాహం చేసేందుకు ఇరు కుటుంబాల పెద్దలు నిర్ణయించారు. ఈనెల 17న నిశ్చితార్థం చేసుకోవాలని భావించారు. అయితే పహల్గాం ఉగ్రవాది దాడి నేపథ్యంలో పాకిస్థాన్ కు ఇండియాకు (ఆపరేషన్ సింధూర్) యుద్ధం రావడంతో నిశ్చితార్థాన్ని రద్దు చేసుకొని, సెలవులను కూడా రద్దు చేసుకొని జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో యుద్ధానికి వెళ్లాడు. అక్కడ యుద్ధం పూర్తి చేసుకొని ఆంజనేయులు మళ్లీ స్వగ్రామానికి చేరుకొని 23వ తేదీ శుక్రవారం బుసిరెడ్డిగారి పల్లె శివాలయంలో నిశ్చితార్థం చేసుకున్నాడు. వచ్చే నెల 5వ తేదీ రొంపిచెర్ల టీటీడీ కళ్యాణమండపంలో వివాహ ఏర్పాట్లు చేసుకున్నారు. దేశం కోసం వివాహాన్ని రద్దు చేసుకొని యుద్ధానికి వెళ్లడం పై పలువురు జవాన్ ఆంజనేయులును అభినందించారు.



# తిరుమలలో డయల్ యువర్ ఈఓ



**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమలలో మద్యం తాగి హల్చల్ చేసిన ఏపీఎస్పీ పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు స్పష్టం చేశారు. అన్నమయ్య భవన్‌లో నేడు డయల్ యువర్ ఈవో కార్యకరమంలో భక్తుల సందేహాలకు సమాధానమిచ్చి పలు సూచనలు చేశారు. అనంతరం ఈవో శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి పుష్కరిణిలో శుభ్రంగా ఉండడం లేదని భక్తుల ఫిర్యాదని తెలిపారు. అద్దె గదులలో బాత్రూంలు కొన్ని సరిగా క్లీన్ చేయడం లేదని భక్తుల తెలిపారని చెప్పారు. శ్రీవారి ఆలయంలో వెండి వాకిలి, బంగారు వాకిలి దగ్గర ఎక్కువ తోపులాట జరుగు తోందని భక్తుల వద్ద నుంచి ఫిర్యాదు అందినట్లు తెలియజేశారు. శ్రీవారి సేవలో సంస్కరణలు తీసుకువస్తున్నమని అన్నారు. ముఖ్య మంత్రి ఇటీవల తిరుమల పర్యటనలో కొన్ని సూచనలు చేశారని తెలియజేశారు. 50% శ్రీవారి సేవకులను అనుభవమున్న వారికి 50% కొత్త వారికి అవకాశం ఇస్తామని అన్నారు. అర్హతను బట్టి శ్రీవారి సేవకులను వినియోగించు కుంటామని తెలిపారు. తిరుమలను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు. 10 బిగ్ క్యాంటీన్లు, 6 జనతా క్యాంటీన్ల కేటాయింపు లో నిబంధనలు మార్పులు తీసుకురా నున్నట్లు వివరించారు. 163 ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేస్తామని అన్నారు. భక్తులకు సాంప్రదాయ వంటలు మాత్రమే అందించాలని మరోమారు స్పష్టం చేశారు. చైనీస్ ఫాస్ట్ ఫుడ్ పూర్తి స్థాయిలో నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. టెక్నాలజీ ఉపయోగించుకుని భక్తులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. త్వరలో జిపిటి చాట్ బోట్ అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 4 సర్వీసులను భక్తులకు అందుబాటులోకి తెచ్చామని మరో 10 సేవలు ట్రయల్ రన్‌లో ఉన్నాయని తెలియజేశారు. లడ్డూలకు కూడా కియోస్క్ మిషన్ ద్వారా యూపిఐ పేమెంట్‌కు పరిశీలిస్తున్నామని అన్నారు. బేస్ట్ సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.



## శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి
# రూ.10 లక్షల విరాళం

**తిరుమల, మేజర్ న్యూస్:** బెంగళూరుకు చెందిన అలెన్ కోచింగ్ ఇనిస్టిట్యూట్ వైస్ ప్రెసిడెంట్ మహేష్ యాదవ్ టిటిడి శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీంకు రూ.10 లక్షలు విరాళాన్ని శనివారం అందించారు. ఈ విరాళానికి చెందిన డిడిని తిరుమల అన్నమయ్య భవన్ లోని సమావేశ మందిరంలో అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరికి దాత అందజేశారు.



# తడలో పడకేసిన పారిశుద్ధ్యం!

**తడ, మేజర్‌న్యూస్:** మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయింది.ఇటీవల కురిసిన వర్షానికి ఆది మొత్తం తడిసిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుధ్యం మెరుగుపరచడానికి పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో కరోనా కలకలం రేపడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు అంతేకాకుండా విషజ్వరాలతో చిన్నారుల నుంచి పెద్దల వరకూ అల్లాడుతున్నారు. ప్రజానీకం వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గ్రామాల్లో చెత్తను తొలగించడంతోపాటు మురుగునీటిని బయటకు పంపి బ్లీచింగ్ చల్లాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎటు చూసినా చెత్త దిబ్బలు, మురుగు కాలువలతో అధ్వానంగా ఉంది. చెత్త సేకరణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెత్తబండి సైతం రోజు తమ వీదులకు రావడం లేదంటూ మహిళలు ఆరోపిస్తున్నారు. ఇళ్ల మధ్యలో చెత్తకుప్పల్లో పందులు స్వైర విహారం చేస్తున్నా పాలకులు అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చేనేత కార్మికులను అన్ని విధాలా అభివృద్ధికి కృషి

**– ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం స్మాల్ క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఎమ్మెల్యేకి స్వాగతం పలికి అధికారులు, ప్రజలు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజులలో నాన్న బొజ్జల గోపాల కృష్ణారెడ్డి ఏవిధంగా అయితే చేనేత కార్మికులను ఆదుకున్నారో అదే విధంగా చేనేత కార్మికులకు అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, చేనేత కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# రోగ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : డీఎంహెచ్ఓ సుధారాణి

**చిత్తూరుప్రతినిధి, మేజర్‌న్యూస్:** రోగ రహిత సమాజాన్ని నిర్మించడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి పేర్కొన్నారు. శనివారం నగర పరిధిలోని రెడ్డి గుంట నందుగల డిఆర్డిఏ స్కిల్ ట్రైనింగ్ సెంటర్ నందు డి ఎం హెచ్ ఓ ఆధ్వర్యంలో ప్రజలకు సంక్రమణ, అసంక్రమణ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసంక్రమణ వ్యాధులు అనగా వ్యాధి వచ్చిన వారి దగ్గర నుండి ఇతరులకు వ్యాపించదు. వీటిని దీర్ఘకాలిక వ్యాధులు అంటారని, గుండె జబ్బులు, క్యాన్సర్లు, థైరాయిడ్,బి.పి, సుగర్, లివర్ వ్యాధులు, మూత్రపిండాల వ్యాధులు మో “నవి. ఇవి ఒక్కసారి వస్తే జీవితాంతం మందుల వాడాల్సిన పరిస్థితని, అందుకే ప్రభుత్వం వారు ఇంటింటి ఎన్సీడీ ప్రత్యేక సర్వే కార్యక్రమాన్ని 18 సంవత్సరాల పైబడిన వారికి చేయుచున్నదని, ఇందులో బిపి షుగర్ క్యాన్సర్లు వంటివి స్క్రీనింగ్ చేసి చికిత్స చేయించి ఫాలోఅప్ చేస్తారని, ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఈ సర్వే కార్యక్రమాన్ని ఉపయోగించుకొని , అవగాహన తోటి ఇతరులకు అవగాహన కల్పించి ,క్యాన్సర్ లేని సమాజ స్థాపనకు మనమందరం కృషి చేద్దామని అవగాహన గావించారు. అలాగే అంటువ్యాధులలో ముఖ్యంగా ఈ సీజన్లో డెంగు, మలేరియా కనిపిస్తుందని కావున ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సమిష్టిగా తప్పక పాటిస్తే లార్వాలు నశించి డెంగు ప్రబలకుండా ఉంటదని అందరూ సమిష్టి కృషి చేద్దామని తెలిపారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత నందు చేతులు సబ్బుతో శుభ్రత భోజనానికి ముందు ,మలవిసర్జన తర్వాత తప్పక పాటించాలని, ప్రజలందరూ కరోనా బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా మాస్క్ తప్పక వేసుకోవాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, శ్రీవాణి,జయరాముడు, రాజేంద్రప్రసాద్, డిఆర్డిఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# కడపలో జరిగే మహానాడు జయప్రదం చేయండి

**– ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పట్టణం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కడపలో జరిగే మహానాడు కార్యక్రమానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలతో శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ అబ్జర్వర్ మారెడ్డి శ్రీనివాసులు రెడ్డితో కలిసి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కడపలో జరిగే మహానాడు ఏర్పాట్లు గురించి శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలతో చర్చించారు.

# శ్రీవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు .శనివారం ఉదయం విఐపి విరామ సమయంలో మాజీ టీమ్ ఇండియా క్రికెటర్ ఎం.ఎస్.కె. ప్రసాద్., తమిళనాడు డిప్యూటీ స్పీకర్ కె.పిచండిలు వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు.



## వెంకటలక్ష్మికి డాక్టరేట్ ప్రదానం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం రాజనీతి మరియు ప్రభుత్వ పాలనాశాస్త్రం విభాగాధిపతి,ఆచార్య బి.వి.మురళీధర్ పర్యవేక్షణలో వెంకటలక్ష్మి బిళ్ళ "భారతదేశ విదేశాంగ విధానంలో ఎన్‌డీఏ పాలనలో పొరుగు దేశాల పట్ల కొనసాగింపు మరియు మార్పులు" అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ను ప్రధానం చేసినట్లు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డా:రాజమాణిక్యం తెలిపారు.వెంకటలక్ష్మి యొక్క పరిశోధన సమకాలీన రాజకీయ పరిణామాలను అధ్యయనానికి దోహదపడే విధంగా ఉందని ఆచార్య బి.వి. మురళీధర్ తెలిపారు.ప్రస్తుతం వెంకటలక్ష్మి పీలేరు లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. విద్యారంగంలో అనుభవజ్ఞురాలైన ఈమె,పలు జాతీయ మరియు అంతర్జాతీయ పరిశోధనా పత్రికలలో పరిశోధన వ్యాసాలను ప్రచురించి,తన విజ్ఞానాన్ని సమాజానికి అందిస్తున్నారు.విద్యా మరియు పరిశోధనలో ఆమె సుదీర్ఘ కృషికి ఇది మరొక గర్వకారణమైన ఘట్టమని పలువురు విద్యావేత్తలు, సహోద్యోగులు కొనియాడుతూ..ఆమెకు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

## బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వనమాల శ్రీనివాసరావు




**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలం లోని ఆలత్తూరు పంచాయతీ, తురకమిట్ట గ్రామానికి చెందిన వెంకటేష్ చిత్తూరు జిల్లా యువజన అధ్యక్షులుగా నియమించారు. వెంకటేష్ అధ్యక్షుల వారి చేతుల మీదుగా నియామక పత్రాన్ని తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ తనకు ఈ పదవిని ఇచ్చినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ బీసీ సంఘం అభివృద్ధి కొరకు, బీసీ సంక్షేమం కొరకు, శక్తి ఉంచిన లేకుండా కష్టపడతానని ప్రమాణం చేశారు. బీసీ సంఘ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## సదాశివేశ్వర స్వామి ఆలయంలో ప్రదోష పూజ



**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** కార్వేటి నగరం మేజర్ పంచాయతీ నగరం చెరువు వద్ద వెలిసిన శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయంలో అభిషేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయం వద్ద నందీశ్వరునికి ప్రదోష పూజ వేద పండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు కోదండ పని మొదలియార్, ప్రధాన కార్యదర్శి రాజేందర్ రెడ్డి, ముఖ్య కార్య కార్య నిర్వహణ అధికారి బాలసుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు ప్రసాద్ రాజు ప్రసాద్, ప్రసాద్ రెడ్డి, సహాయ కార్యదర్శి సుబ్బరాయుడు యాదవ్, కృష్ణ స్వామి రాజు, సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో టిడిపి కార్యకర్త నాగేంద్రబాబు మృతి



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** మండలంలోని ఎ.రంగంపేట పంచాయతీ కృష్ణాపురం గ్రామానికి చెందిన నాగేంద్రబాబు వ్యక్తిగత పనుల నిమిత్తం తిరుపతిలోని గరుడ ఫ్లైఓవర్ పై వెళుతూ స్కూటర్ అదుపుతప్పి కింద పడడంతో నాగేంద్రబాబు మృతి చెందాడు. నాగేంద్రబాబు మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తనయుడు, యువ నాయకుడు పులివర్తి వినీల్ బాబు వారితో కలిసి నాగేంద్రబాబు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలని తెలిపారు. వీరి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, స్థానిక నాయకులు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జీవవైద్యంపై రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీల్లో.. ఎస్వీయూ విద్యార్థినికి మొదటి స్థానం



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** "అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం" సందర్భంగా రాష్ట్రస్థాయిలో జీవ వైవిధ్యంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మదనపల్లి జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ(బయోటెక్నాలజీ) రెండవ సంవత్సర విద్యార్థిని గుణ విజయ మొదటి స్థానంలో నిలిచారు. జిల్లా స్థాయి పోటీల్లో పద్మావతి డిగ్రీ కళాశాల బీఎస్సీ జువాలజీ రెండవ సంవత్సర విద్యార్థిని దీప్తి మొదటి స్థానం పొందారు.ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి – గ్రీన్ క్రాప్ సంయుక్తంగా ఈ పోటీలు చేపట్టాయి.ఇందులో విజేతలుగా నిలిచిన విద్యార్థులు గుణ విజయ,దీప్తిని ఎస్వీ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ సిహెచ్. అప్పారావు,రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు, యూనివర్సిటీ కల్చరల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీల్లో యూనివర్సిటీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

## వైభవంగా శ్రీ సెల్వి వినాయక స్వామి, గ్రామ దేవత పోన్నియమ్మ తిరునాళ్లు

**గుడిపాల, మేజర్‌న్యూస్:** మండలంలోని రామభద్రాపురం గ్రామ పంచాయతీ చుక్కవారిపల్లి గ్రామం నందు వెలసియున్న శ్రీ సెల్వి వినాయక స్వామి, గ్రామ దేవత శ్రీ పోన్నియమ్మ వార్షిక తిరునాళ్లు అతి వైభవంగా నిర్వహించడం జరిగింది. తిరునాళ్లలో భాగంగా శ్రీ సెల్వి వినాయక స్వామి, పోనియమ్మకు మహాఅభిషేకం గణపతి హోమం పూర్ణాహుతి హోమం కుంభాభిషేకం నిర్వహించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఈ తిరునాళ్ల సందర్భంగా మధ్యాహ్నం స్థానిక సర్పంచ్ గోళ్ళ హరిణి హేమాద్రి నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం మంగళ వాయిద్యాలు సాంస్కృతిక కార్యక్రమాలు బాణసంచా వేడుకలతో అతి వైభవంగా పురవీధులలో శ్రీ సెల్వి వినాయక స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు శాసనసభ్యులు గురుజాల జగన్మోహన్ తండ్రి గారైన గురజాల చెన్నకేశవ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు సి సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జెడ్పిటిసి సభ్యులు బాలాజీ నాయుడు



,సుమతి మురళి నాయుడు,,మండల ఉపాధ్యక్షులు అనిల్ కుమార్, ఎంపిటిసి హరిప్రసాద్ చౌదరి ,మాజీ సర్పంచ్ పయణి ,మాజీ ఎంపీటీసీ సభ్యులు కె. షణ్ముగం గ్రామస్తులు డీలర్ షణ్ముగం దామోదరం మోహన్ గోవింద నాయుడు కుమార్ నాయుడు సేటు దేవరాజులు నీలకంఠ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌లో ఇచ్చిన ప్రతి అర్జీ పరిష్కారం : ఎమ్మెల్యే బొజ్జల

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి పట్టణం పి ఆర్ గెస్ట్ హౌస్‌లో శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధించి అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం నుండి వచ్చిన అర్జీ లను సకాలంలో పరిష్కారం చేసి ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు



**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** మండలంలోని కొమ్మన గుంట గ్రామం మాజీ సర్పంచ్ పార్వతమ్మ కుమారుడు డాక్టర్ మధుసూదన్ అనారోగ్యంతో మరణించారు. వారి పార్థివ దేహానికి మాజీ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు మండలం ఎంపీపీ ఉన్నాం నిర్మల, స్వర్ణ మూర్తి, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధనమున్న రాయల్ , మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణ కుమార్ ,కంటా ఉదయ్ కుమార్, మొగరాల గణేష్ , కొల్లూరు హరినాథ్ల నాయుడు, వెంకటేశ్వర్లు, గఫూర్,వేలూరు రమేష్, విజయ్ కుమార్ రెడ్డి, తదితరులు సంతాపం తెలియజేశారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని డి.ఎం పురం గ్రామానికి చెందిన వార్తల సంజీవి మందడి రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు కుమార్తెలు గురవమ్మ, మునిలక్ష్మి, సుబ్రహ్మణ్యం, నారాయణప్ప,కృష్ణమూర్తి ,భీమారావు తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో సూక్ష్మ వ్యాధులు దూరం



**గుడిపాల, మేజర్‌న్యూస్:** పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని డాక్టర్ రష్మిత తెలిపారు. శనివారం చామంతి పురం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగాడాక్టర్ రష్మిత మాట్లాడుత ఎంతోప్రతిష్టాత్మకంగా ప్రభుత్వంచేపట్టిన కార్యక్రమం ఉచిత వైద్య సేవకార్యక్రమం. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి ప్రతి గడప గడపకు వైద్యుల పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రతి రోగులకు ఉచితవైద్య పరీక్షలు అందించడం జరుగుతుందని డాక్టర్ రశ్మిత తెలిపారు. గర్భవతులు మంచి పౌష్టికాహారాన్ని తీసుకుంటే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంవంతంగా ఉంటారని గర్భవతులకు డాక్టర్ రష్మిత తెలిపారు. శరీరంలో ఎటువంటి జబ్బు సంభవిస్తే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరీక్షలు చేయించుకోవాలని రోగులకు సూచించారు. బిపి, షుగర్,థైరాయిడ్, వంటి రోగులకు పరీక్షలు నిర్వహించి వైద్యుల సలహాల ద్వారా, మందులు సక్రమంగా వాడితే వాటినిజయించవచ్చని డాక్టర్ తెలిపారు. నడవలేని పరిస్థితిలో తమ ఇంటి వద్దనే వైద్యం అందించడం జరుగుతుందని డాక్టర్ రష్మిత తెలిపారు. వేసవికాలంలో ఎక్కువ నీరు త్రాగాలని ప్రజలకు సూచించారు. చామంతి పురంగ్రామంలో ఓపి ద్వారా 70 మంది నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రష్మిత, శ్రీలక్ష్మి, శశికళ, రాధా, 104 సిబ్బంది ప్రవీణపాల్గొన్నారు.

## రేణిగుంట ఐదో వార్డులో రోడ్డు అంతా చెత్తే



**రేణిగుంట, మేజర్‌న్యూస్:** స్థానిక షాదీ మహల్ వద్ద ఐదవ వార్డ్ వీధులు చెత్తతో పేరుకుపోవడంతో డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. స్థానికులు రోడ్డుపైనే ఉన్న కాలి స్థలంలో చెత్తను పారవేయడంతో పశువులు మూగ జంతువులు చెత్త కవర్లను చెల్ల చెదురు చేయడంతో రోడ్డు అంతా చెత్త చెదారంతో నిండిపోయింది. ఈ వీధిలో గత వారం రోజులుగా కుప్పలు తెప్పలుగా పేరుకుపోతుంది. అయినప్పటికీ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

## మన భవిషత్ సమస్యల పరిష్కారం ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌తోనే సాధ్యం

**కుప్పం, మేజర్‌న్యూస్:** కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్, ఐసిటి అకాడమీ ఆధ్వర్యములో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అనే అంశంపై వారం రోజుల పాటు నిర్వహించిన అధ్యాపకుల శిక్షణ కార్యక్రమం (ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం) శనివారంతో ముగిసింది. ఈఎఫ్‌డిపి ముగింపు కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్ . సుధాకర బాబు ముఖ్య అతిధిగా హాజురయ్యారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఓటి పై వారం రోజులపాటు నిర్వహించిన పాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం అధ్యాపకుల పరిశోదనకు ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. 101 తో ఎన్నో లాభాలు ఉన్నాయని మానవ ప్రమేయం లేకుండానే పరికరాలు, వస్తువులు వాటంతటవే సమాచారం పంపించవచ్చునని, దీంతో ఎక్కువ నాణ్యమైన సేవలు అందించవచ్చునని సామర్థ్యం పెరుగుదలకు,ఉదాహరణ ప్రతి ఇంట్లోని కరెంటు రీడింగును ఆటోమేటిక్ గా సర్వరుకు పంపిస్తాయి. కరెంటు బిల్ ఆటోమేటిక్ వెళుతుందని, మానవులు వెళ్లడానికి కుదరని స్థలాల నుండి కూడా నియంత్రించవచ్చునని, పెద్ద పెద్ద విండ్ టర్బైన్లు, ఎత్తైన విద్యుత్ టవర్లను కంట్రోల్ చేయవచ్చునని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న అధ్యాపకులకు సర్టిఫికెట్స్ అందజేశారు.ఈ కార్యక్రమములో ఐసిటి అకాడమీ టెక్నికల్ ట్రైనర్ ఎస్. వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ డా .ఎస్.భాస్కరన్, ఆర్ డి విభాగాధిపతి డా . జి.ఎన్ .కోదండరామయ్య, ట్రైనింగ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ డి.జయకుమార్, వివిధ విభాధిపతులు, పిఆర్ఓ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.



### సీఎం పర్యటనకు

# పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశానికి విచ్చేయుచున్న నేపథ్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ డీబ్రిఫింగ్ చేస్తూ భద్రతా పరమైన చర్యలను పటిష్టంగా నిర్వహించాలని పర్యటనలో భాగంగా ఎటువంటి అసమర్థత కనబరచారాదని తెలిపారు. అలాగే సిఎం తిరుగు ప్రయాణం అయ్యే వరకూ ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా గట్టి భద్రత కల్పించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తు అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తూ రూట్ మ్యాప్‌ను ప్రదర్శించి సిఎం పర్యటనను గూర్చి క్షుణ్ణంగా వివరించారు. సి.ఎం ఇల్లు, పరిశర ప్రాంతాలు, హెలిప్యాడ్, సిఎం రోడ్డు మార్గాన కుప్పం చేరుకుంటారు. కనుక రోడ్డు మార్గాన బందోబస్తులో ఉన్నటువంటి సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉంటూ ఏవైనా అనుమానాస్పద వాహనాలు ఉన్న లేదా వ్యక్తులు సంచరిస్తున్న వెంటనే అధికారులకు తెలియజేయాలి. బిడిటీం సిబ్బంది సిఎం రోడ్డు మార్గాన అంతటా క్షుణ్ణంగా పరిశీలించాలి, ప్రతి కల్వర్టు డిటెక్టర్, డాగ్ స్క్వాడ్ సిబ్బందిచే అంతటా మరింత జాగ్రత్తగా పరిశీలించాలి. అధికారులు, ముఖ్యనాయకుల వాహనాలకు, ఇతరుల వాహనాలనకు పార్కింగు స్థలాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ నాచ్కేత్ విశ్వనాథ్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ శివానంద కిషోర్, కుప్పం డిఎస్పీ పార్థసారథి, జిల్లా బందోబస్తు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# భక్తాగ్రేశ్వరుడిపై వేణుగోపాలుడి విహారం

(మొదటిపేజీ తరువాయి)

సమేతుడైన స్వామివారు ఊంజుల సేవ నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే హరికథ కాలక్షేపాన్ని నిర్వహించారు.

**గజ వాహనంపై ఊరేగిన మువ్వ గోపాలుడు**

బ్రహ్మోత్సవాల భాగంగా శనివారం రాత్రి గజవాహనపై సర్వాంగ సుందరంగా అలంకరించి వేదపండితులు మంత్రం ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గజవాహనం ఊరేగింపు తిలకించడానికి గ్రామంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తిరువీధుల్లో విహరిస్తూ కోలాటాలు భాజా భజంత్రీలు మధ్య ఊరేగింపు నిర్వహించారు, చెక్కభజనలు కోలాహలంగా నిర్వహించారు. భక్తులు కర్పూరలు తెరిచి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపు అనంతరం స్వామి వారికి ఏకాంత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్నం, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిరామయ్య ఆలయ అధికారులు గుణశేఖర్ కిరణ్ సురేష్‌కుమార్, ప్రధాన అర్చకులు గోపాలచార్యులు, కంకణ భట్టాచార్యులు తరుణ్ కుమార్, వేద పండితులు నారాయణ దాసరిది రమేష్ శబరి ధ్వనంతరి ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.







# అవినీతి, అక్రమార్కులకే ఉపాధి

(మొదటిపేజీ తరువాయి)

ఉద్దేశం పక్కదారి పడుతోంది. మండలంలోని గుణపాడు, ఆరూరు, నార్తువరత్తూరు, ఈశ్వరవాక, యాకసిరి తదితర పంచాయితీల పరిధిలో ఉపాధి పనులలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా నివాసం ఉండని వారు, ప్రైవేటు కంపెనీలలో పనిచేస్తున్న ఉద్యోగులు నిత్యం కూలి పనులు చేస్తున్నట్లు మస్టర్లు వేస్తున్నారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిడి మేరకు వారి కుటుంబ సభ్యుల పేరుతో జాబ్‌కార్డులు ఇచ్చి పనులకు వస్తున్నట్లు చూపుతున్నారు. మరోవైపు కూలీల నుంచి వారం వారం భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



### కూటమి ప్రభుత్వం వచ్చాక అవినీతి, అక్రమాలు..?

కూటమి ప్రభుత్వం వచ్చాక ఉపాధి పథకం పనులు మండలంలో నెమ్మదించాయి. అదే సమయంలో అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గరిష్ఠ వేతనం వచ్చేలా చేయడం, వంద రోజుల పనిదినాల కల్పన, మొత్తం పని దినాల లక్ష్య సాధన, మెటీరియల్ కోటా నిధుల సద్వినియోగం తదితర పలు అంశాలలో పనులు ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడం విమర్శల పాలవుతోంది. శ్రామికులకు ప్రతిఫలం దక్కక లక్ష్య సాధన నెరవేరడం లేదని పలువురు వాపోయారు.

**మస్టర్లలో మాయ...** ప్రస్తుతం పనులు జరుగుతున్న తీరు చూస్తే అత్యంత దారుణంగా ఉంది. రోజువారీ కూలీల లక్ష్యంలో ప్రస్తుతం సుమారు 50 శాతం వరకు మాత్రమే వస్తున్నారు. అయితే అందులోనూ భారీగా బోగస్ మస్టర్ వేస్తున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. నార్తువరత్తూరు పంచాయితీ పరిధిలో జెసిబి, యంత్రాలతో పనులు చేపట్టి కూలీల పేరుతో మాస్టర్లు వేసి మాయాజాలం ప్రదర్శిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాక కొన్ని పంచాయితీల పరిధిలో పనికి వచ్చిన కూలీలు చేసిన పనికన్నా అధికంగా చూపుతున్నారు. ఇందుకుగాను వారి నుంచి సిబ్బంది భారీగా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పనులకు వచ్చిన కూలీల నుంచి 200, రాకుండా మస్టర్ వేస్తే 300 రూపాయలు వారానికి వసూలు చేస్తున్నారు. అలా ఇచ్చిన వారి మస్టర్లు కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. ఇక కుటుంబంలోని కొందరు పనికి వచ్చి కొందరు రాకపోతే రాని వారికి కూడా మస్టర్ వేసి వారి నుంచి 300 వసూలు చేస్తుండగా అసలు గ్రామాల్లో లేనివారికి కొందరికి మస్టర్లు వేసి అలాంటి వారి నుంచి 600 వరకూ వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు స్థానిక నాయకులు, క్షేత్రస్థాయి సిబ్బంది కుటుంబసభ్యులు, బంధువులు, అనుకూల వ్యక్తుల పేర్లతో జాబ్‌కార్డులు ఇచ్చి వారు పనికి వచ్చినట్లు చూపి ఆ మొత్తం కూడా పంచుకుంటున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి.

**కొలతల్లో కిరికిరి...** వాస్తవ లెక్కల ప్రకారం రోజువారీ చాలా ప్రాంతాల్లో చేసిన పనికి 100నుంచి 120 రూపాయలు వరకు కూలి వస్తుండగా అదనపు కొలతలు చూపి 200నుంచి 250 రూపాయలు వరకు వచ్చేలా సిబ్బంది చేస్తున్నట్లు సమాచారం. అలా చేసిన పనికన్నా కూలీలకు వారానికి అదనంగా ఆరేడు వందలు వస్తుండటంతో వారి నుంచి 200 వసూలు చేస్తున్నారు. చేసిన పనికన్నా ఎంతో కొంత తమకు కూడా అదనంగా వస్తుండటంతో కూలీలు చాలా ప్రాంతాల్లో కిమ్మనకుండా సిబ్బంది అడిగిన మొత్తం ఇస్తున్నట్లు సమాచారం. అక్కడక్కడా ఎవ్వరైనా ప్రశ్నిస్తే ఉన్నతాధికారులకు పంపాలని సిబ్బంది చెప్తున్నట్లు తెలుస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో జరుగుతున్న పనులలో అవినీతి, అక్రమాలపై ఆధారాలతో సహా త్వరలో మరిన్ని సమగ్ర కథనాలు. ఉపాధి పనులలో అవినీతి, అక్రమాలపై స్థానిక ఏపీఓను వివరణ కోరేందుకు మేజర్‌న్యూస్ ఫోన్ చేయగా ఫోన్ తీయలేదు.

జనం కోసమే
సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116




## మద్యం దుకాణాల వద్ద ఎక్సైజ్ శాఖ నిఘా

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మద్యం విక్రయాలలో ధరలు పెంచినా, సమయపాలనలో అతిక్రమిస్తే చర్యలు తప్పవు కార్వేటి నగరం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలను శుక్రవారం రాత్రి ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కార్వేటి నగరం మరియు సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేశారు.మద్యం దుకాణాల్లో ధరల పట్టిక,రికార్డులు,ఇతర నిబంధనలు పరిశీలించారు. ప్రయివేటు మద్యం దుకాణాలైను నిబంధనల ప్రకారం విక్రయించాలని ఆదేశించారు. మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు, మాత్రమే నిర్వహించాలని, సమయపాలన పాటించని మద్యం దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ శిరీష దేవి హెచ్చరించారు. ప్రతి రోజు ఎక్సైజ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించామని సిఐ తెలిపారు.

## గోవింద ధామంను సందర్శించిన ఇటుక బట్టీల అసోసియేషన్ అధ్యక్షుడు



చంద్రగిరి, మేజర్‌న్యూస్: చంద్రగిరిలోగోవింద ధామం ను ఇటుక బట్టీల అసోసియేషన్ అధ్యక్షుడు కె.వి. చౌదరిఇటుక బట్టీల యజమానులతో కలిసిసందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా తరపున ప్రతి ఇటుక బట్టీల యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి గోవింద ధామం నిర్మాణంలో భాగస్వామ్యం అవుతూ తమవంతు సహయ , సహకారాలు అందిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు కె. వి. చౌదరి, కత్తి సుధాకర్ తెలిపారు. గోవింద ధామంకు ఇటుకలు సరఫరా చేస్తామని ముందుకు వచ్చిన ఇటుక బట్టీల అసోసియేషన్‌కు ఎమ్మెల్యే పులివర్తి నాని, గోవింద ధామం కమిటీ అధ్యక్షులు వీరంగారి రమేష్ రెడ్డి, కమిటీ సభ్యులుఇటుక బట్టీల అసోసియేషన్‌కు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలోనాగరాజు నాయుడు, ఓంకార్ భరత్ రాజ్, జనార్ధన రెడ్డి, విశ్వనాథ్, ప్రకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా మండల ప్రధాన కార్యదర్శిగా కొమిరి మాదవయ్య



**వరదయ్యపాలెం మేజర్‌న్యూస్:** మండల వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శిగా చిన్నపాండూరు గ్రామపంచాయతీకి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు కొమిరి మాధవయ్య ను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ ఆవిర్భావం నుంచి నిబద్ధత కలిగిన నాయకుడిగా పార్టీ సిద్ధాంతాలను అనుసరించి పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన మాధవయ్యను పార్టీ అధిష్టానం గుర్తించి మండల ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఆ మేరకు తన నియామకానికి కృషిచేసిన నియోజకవర్గ సమన్వయకర్త నూక తోటి రాజేష్ అన్న గారికి,అలాగే మండల పార్టీ అధ్యక్షులు నాయుడు దయాకర్ రెడ్డికి, ఇతర పార్టీ పెద్దలకు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ జగనన్న రెండవ సారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు గ్రామస్థాయిలో తనవంతు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని పార్టీ పెద్దలకు ముఖ్య నాయకులకు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. మీ అందరి ఆశీస్సులతో పార్టీలో ముందుకెళతానని పేర్కొన్నారు.

## మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

### నాయుడుపేట అర్బన్ సీఐ బాబి



**నాయుడుపేట, మేజర్ న్యూస్:** మద్యం మత్తులో వాహనాలు నడిపి మనం ప్రమాదంలో పడడంతో పాటు ఇతరులను ప్రమాదంలో నెట్టెయవద్దని మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు అని నిబంధనలకు విరుద్ధంగా, మద్యం సేవించి వాహనాలను నడిపిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని నాయుడుపేట అర్బన్ సీఐ బాబి హెచ్చరించారు.నాయుడుపేట అర్బన్ సీఐ బాబి ఆధ్వర్యంలో శనివారం నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు.రహదారి నుండి రాకపోకలు సాగిస్తున్న ప్రతి వాహనాన్ని నిలిపి, డ్రైవర్లను బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ బాబి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు పోలీస్ శాఖ అనేక చర్యలు చేపడుతున్న ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని గుర్తు చేశారు. మైనర్లకు, తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇచ్చి రోడ్లపైకి పంపిస్తే భారీ జరిమానతో పాటు, కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఫోర్ వీల్ , ఆటో డ్రైవర్లు , వాహనదారులు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడప రాదని నెంబర్ ప్లేట్లు లేకుండా, తిరిగితే వాహనాలను సీజ్ చేస్తామని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని , అలా ఇస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని సిఐ నాగరాజు హెచ్చరించారు, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ట్రైబ్స్ స్టేట్ అడ్వైసర్ కౌన్సిల్ మెంబర్‌గా ఎం సుబ్బయ్య

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ గిరిజన అడ్వైసర్ స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా శ్రీకాళహస్తికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యం. సుబ్బయ్యను ఏపీ ప్రభుత్వం నియమించడం జరిగింది. శనివారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల



మీదుగా అందుకున్నారు. బొజ్జల సుధీర్ రెడ్డి సుబ్బయ్యను ఘనంగా సత్కరించి అభినందించారు, గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం నుంచి గిరిజలకు వస్తున్న పథకాలను వారికి అందే విధంగా అధికారులతో కలిసి గిరిజనులకు సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు, నియోజకవర్గంలో గిరిజన కళాశాలలను గిరిజనుల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ట్రైబ్స్ స్టేట్ అడ్వైసర్ కౌన్సిల్ మెంబర్ యం.సుబ్బయ్య మాట్లాడుతూ..తనకు నేడు ఆంధ్రప్రదేశ్ ట్రైబ్స్ అడ్వైసరీ కౌన్సిల్ మెంబర్ నియమించినందుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు. గిరిజనులు సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ,రాష్ట్రంలో ఉన్న గిరిజనుల పరిస్థితులను వారి కష్టాలను, వారికి కావాల్సిన సౌకర్యాలను,సేకరించి వాటిని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లి గిరిజనులకు ప్రభుత్వం మరింత సహాయ సహకారలను అందించేవిధంగా కృషి చేస్తానని తెలియజేశారు.

## ప్రభుత్వ కార్యాలయంలో ప్రవేటు ధ్వి చక్ర వాహనానికి విద్యుత్ ఛార్జింగ్

- **ప్రభుత్వ ఆదాయానికి గండి**
- **ప్రభుత్వ కార్యాలయంలో అనుమతి లేదు, మందలిస్తాం ఏపిఎ**




**పూతలపట్టు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ అధికారులు పర్యవేక్షణ కరువైనందున ప్రభుత్వ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగి ప్రవేటు ద్విచక్రవాహనానికి విద్యుత్ ఛార్జింగ్ పెట్టడంచేత ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. స్థానికులు సమాచారం మేరకు వివరాలు ఇలాఉన్నాయి. పూతలపట్టు మండల కేంద్రంలోఉన్న మండల మహిళ సమాఖ్య ప్రభుత్వ కార్యాలయంలో వెలుగు సిసిగా విధులు నిర్వహిస్తున్న ఒమహిళ అధికారిణి ఏబి 40 బిఎస్ 0218 నెంబరు గల ద్విచక్ర బ్యాటరీ వాహనం కు ప్రతిరోజు మండల మహిళ సమాఖ్య ప్రభుత్వ కార్యాలయంలో విద్యుత్ ఛార్జింగ్ పెట్టుకోవడం చేత ప్రభుత్వానికి భారీగా విద్యుత్ కోత పడుతుంది. ప్రతీరోజు సుమారు 10 యూనిట్లు వాడుకొంటుంనట్లు సమాచారం.స్థానికులు సమాచారం మేరకు మేజర్ న్యూస్ శుక్రవారం పూతల పట్టు మండల మహిళ సమాఖ్య ప్రభుత్వ కార్యాలయంను సందర్శచింగా దివ్యచక్ర వాహనం విద్యుత్ ఛార్జింగ్ పెట్టుకొంటున్న సంఘటన వెలుగు చూసింది. ఈవిషయమై సంబంధించిన ఏపిఎంను వివరణ కొరగా ప్రభుత్వకార్యాలయంలో విద్యుత్ ప్రవేటు వాహనాలకు విద్యుత్ ఛార్జింగ్ పెట్టుకోవడానికి ప్రభుతం నుంచి ఎలాంటి అనుమతులు కానీ ఉత్తర్వులు లేవని మందలించి తగుచర్యలు తీసుకొంటామని తెలిపారు. ఇప్పటికైనా సంభదిత అధికార్లు విచారణ జరిపి ప్రభుత్వకార్యాలయంలో విద్యుత్ ఆదా చేసి ప్రభుత్వ ఆధాయం కల్పించాని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధి ధ్యేయంగా భవిత కేంద్రాలు

**సూళ్లూరుపేట మేజర్‌న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల మే 13 నుండి జూన్ 9 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించే సర్వేలో భాగంగా, శనివారం సులూరుపేట మండలంలో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ డి.చంద్రశేఖర్ రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భవితా కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్యను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు ,వివిధ అలవెన్సు, గర్ల్స్ స్టైఫండ్ సమగ్ర శిక్ష ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల బడి ఈడు పిల్లలు ఉంటే సూళ్లూరుపేట భవిత కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. భవితా కేంద్రం ద్వారా ఎంతోమంది ప్రత్యేక అవసరాలు గల పిల్లల యొక్క విద్య,వ్యక్తిగత నైపుణ్యాలు, మానసిక వికాసాలు అభివృద్ధి చెంది సాధారణ విద్యార్థులవలె పదవ తరగతి పరీక్షలలో కూడా ఉత్తీర్ణత సాధించడం జరిగింది. ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్దే లక్ష్యంగా భవిత కేంద్రాలు పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం మీకోసం ఎన్నో నిధులు ఖర్చు చేస్తుందని, పిల్లల యొక్క మానసికంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక



ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. సర్వే చేస్తున్న సహిత విద్య ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ప్రత్యేక అవసరాలు గల బడి ఈడు పిల్లలు భవిత కేంద్రంలోనే ఉండాలని, అప్పుడే వారు మానసికంగా అభివృద్ధి చెందుతారని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 శ్రీనివాసులు రెడ్డి, ఐఈఆర్పి ఎన్ సాయి సంధ్య పాల్గొన్నారు.